క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



చౌటుప్పల్‌లోని నాగులకుంటను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

చౌటుప్పల్ : భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి సూచించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఊరచెరువు, నాగుల కుంటలను బుధవారం ఆయన సందర్శించారు. భారీగా వరద వస్తే తీసుకోవాల్సిన చర్యలపై నీటిపారుదల, మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.

ఆలేరు మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ఆలేరు: భారీ వర్షసూచన నేపథ్యంలో అత్యవసర సహాయ చర్యల కోసం ఆలేరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక టీం, సాయంత్రం నుంచి ఉదయం వరకు మరో టీం 24గంటలపాటు హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. అత్యవసర సేవల కోసం 63004 87155 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

గుండాల : భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం గుండాల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం తుర్కలశాపురం గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న చుక్క చిలకమ్మ ఇంటిని, బండకొత్తపల్లి, వస్తాకొండూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ దేవేందర్‌రావు, ఎంపీఓ సలీమ్, ఇమ్మడి దశరథ గుప్తా ఉన్నారు.

అత్యవసర సమయాల్లోనే బయటకు రావాలి

ఆత్మకూరు(ఎం): రాబోయే రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లావణ్య సూచించారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దన్నారు. వర్షాల కారణంగా ఏదైనా సమస్య తలెత్తితే 98662 10300, 91334 25868నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఆమె వెంట డీటీ ఎండీ షఫీయోద్దీన్, ఆర్‌ఐ మల్లికార్జునరావు ఉన్నారు.

డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ ఫీజు తగ్గించాలి

భువనగిరి: పాఠశాలల్లో నిర్వహించే డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ ఫీజు తగ్గించాలని కోరుతూ బుధవారం బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారిలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మిరయాల దుర్గప్రసాద్, కార్యదర్శి చిట్టిబాబు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, ప్రేమ్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

అడ్డగూడూరు: మండల పరిధిలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన ఇరుగు సోమయ్య (60) ఇటీవల మృతి చెందాడు. బుధవారం సోమయ్య చిత్రపటానికి పవన్ సాయి హాస్పిటల్స్ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్, టీవీఎస్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బాలెంల నరేందర్ నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బాలెంల దుర్గయ్య, పరుశురాములు, కృష్ణ, సురేష్, నరేష్ తదితరులున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుర్ర యాదయ్య అనే గీత కార్మికుడు బుధవారం ఉదయం తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మోత్కూరు : మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో శ్రీ రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సహకారంతో 40 మంది విద్యార్థులకు బుధవారం స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, బుక్స్, మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు రాజేష్, నవీన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బడిని బతికించాడు!



ఎర్రంబెల్లిలోని ప్రాథమిక పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయుడు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వనం శ్రీనివాసులు

- 2012లో విద్యార్థులు లేక మూతబడి.. గతేడాది తెరుచుకున్న ఎర్రంబెల్లి పాఠశాల
- విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులను ఒప్పించిన ప్రధానోపాధ్యాయుడు
- దూరప్రాంతాల వారిని తీసుకొచ్చేందుకు ఆటోకు ప్రతినెలా రూ.5వేలు చెల్లిస్తున్న హెచ్‌ఎం
- ఈఏడాది 30కి చేరిన విద్యార్థుల సంఖ్య

భువనగిరి: మూతబడిన పాఠశాలల 12 సంవత్సరాల తర్వాత తిరిగి జీవం పోసుకుంది. ప్రస్తుతం 30 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. భువనగిరి మండలంలోని ఎర్రంబెల్లి గ్రామంలో 1974లో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయగా.. 2012 వరకు కొనసాగింది. ఆ తర్వాత విద్యార్థులు లేక మూతబడింది. ఈ బడికి తిరిగి జీవం పోయాలనే ఉద్దేశంతో విద్యాశాఖ 2024–25 విద్యా సంవత్సరంలో భువనగిరిలోని గాంధీనగర్‌లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వనం శ్రీనివాసులును డిప్యుటేషన్‌పై ఇక్కడకు బదిలీ చేసింది. ఈ క్రమంలో ఆయన గ్రామంతో పాటు సమీపంలోని ఏడుమోట్లబావి, వేంబావి, నాగిరెడ్డిపల్లి పరిసర ప్రాంతాల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలకు పంపే విధంగా వారి తల్లిదండ్రులను ఒప్పించారు. విద్యార్థులకు హేర్‌కటింగ్ చేయించడంతో పాటు ప్రతి రోజు ఆటోలో వచ్చే విధంగా ప్రతి నెల తానే రూ. 5వేలు చొప్పున ఆటోకు చెల్లిస్తూ వస్తున్నాడు. తన సొంత వాహనంపై సైతం విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావడం ప్రారంభించాడు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన మహిళా సంఘం అధ్యక్షురాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరిత విద్యార్థులకు భోజనం వంట చేసి పెట్టేందుకు ముందుకు వచ్చింది. 21 మంది విద్యార్థులతో పాఠశాలను కొనసాగించగా.. ఈ విద్యా సంవత్సరం మరో తొమ్మిది మంది పెరగడంతో ప్రస్తుతం పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు, వలంటీర్ విధులు నిర్వహిస్తున్నారు.

దాతల సహకారంతో..

మూతబడిన పాఠశాల తిరిగి ప్రారంభించిన అనంతరం మౌలిక వసతుల కల్పించేందుకు ప్రధానోపాధ్యాయుడు దాతల సహకారం తీసుకున్నారు. గ్రామానికి చెందిన కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి రూ.7వేలతో వంట పాత్రలు, విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రూ. 5వేల సహకారంతో విద్యార్థులకు టై, బెల్ట్, షూ, సామగ్రి అందజేశారు. స్థానిక రైస్ మిల్లుకు చెందిన యాజమాని 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గోర్ల వైకుంఠం పాఠశాలకు మైక్ సెట్ అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వైశ్య ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులకు టై, బెల్ట్, షూ, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. డీఈఓ సత్యనారాయణ చొరవతో గ్రామానికి సమీపంలో ఉన్న గ్లాస్ ఫ్యాక్టరీ వారు పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ నిధులతో మూత్ర శాలలు, భవన మరమ్మతులు, శాశ్వత విద్యుత్ సౌకర్యం, 10 డెస్క్ బెంచీలు ఇచ్చేలా ప్రణాళికను సిద్ధం చేశారు.



తన వాహనంలో విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు హెచ్‌ఎం ఎంతో కృషి చేశారు



12 సంవత్సరాల తర్వాత గ్రామంలో పాఠశాల తిరిగి పాఠశాలను ప్రారంభించడంలో హెచ్‌ఎం ఎంతో కృషి చేశారు. దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. దీంతో గ్రామానికి చెందిన పిల్లలను ఊరిలోని పాఠశాలకే పంపాలని నిర్ణయించుకున్నాం.

– గాదె యశోధ, మాజీ సర్పంచ్, ఎర్రంబెల్లి

ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నాం



గ్రామంలో పాఠశాల నడవక పోవడంతో పక్క గ్రామానికో, భువనగిరికో పంపాల్సి వచ్చేది. గ్రామంలోనే పాఠశాలలను తిరిగి ప్రారంభించడంతో మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపడం మానేసి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాం. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే చదువు చెబుతున్నారు.

– భానుచందర్, విద్యార్థి తండ్రి, ఎర్రంబెల్లి

అందరి సహకారంతోనే..

పాఠశాలలను తెరిపించడానికి గ్రామస్తులందరూ సహకరించారు. గ్రామ పెద్దలతో పాటు మహిళా సంఘాల సభ్యులు కూడా సహకరించారు. బాల కార్మికులుగా మిగిలిపోవద్దని వారిని పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులను ఒప్పించాం. దాతల సహకరంతో పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేలా కృషి చేశాం. ప్రైవేట్‌కు దీటుగా చదువులు చెబుతున్నాం. గ్రామస్తులకు ఈ పాఠశాలపై నమ్మకం ఏర్పడింది.

– వనం శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు

మోత్కూరును నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం): కేంద్ర ప్రభుత్వం 2026లో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మోత్కూరును నియోజక వర్గ కేంద్రంగా ప్రకటించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మోత్కూరు ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని, గుండాల, అడ్డగూడూరు, ఆత్మకూరు (ఎం), మోటకొండూరు మండలాలను కలిపి మోత్కూరు మండలం నియోజక వర్గ కేంద్ర ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అనంతరం తహసీల్దార్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నాయకులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, నిలిగొండ మత్స్యగిరి, తొగిటి మనోహరాచారి, కొయ్యలకారి జహంగీర్, గొలుసుల శ్రీనివాస్, కోల మహేష్, సత్తయ్య, మహేశ్వరి, నర్సయ్య, రమేష్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐటీయూసీ ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

భువనగిరిటౌన్ : కార్మికులు తమ హక్కుల సాధనకు, కార్మిక చట్టాల పరిరక్షణకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, పుట్ట రమేష్, ముంతాజ్ బేగం నాయకులు కాశపాక దయాకర్, గౌరవంతుల శ్రీనివాస్, మడుగుల స్వామి, బొజ్జ గణేష్, జహంగీర్, మల్లేష్, నరేష్, బోయిని భిక్షపతి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



భూదాన్‌పోచంపల్లి: సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి: సీపీఎం నేత సీతారాం ఏచూరి జయంతిని బుధవారం భూదాన్‌పోచంపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఏచూరి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యుడు మంచాల మధు, నాయకులు వడ్డేపల్లి యాదగిరి, వెంకటేశం, శ్రీను, రాజన్ బాబు, శ్రీనివాస్, రాంచంద్రం, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం: సీపీఎం నేత సీతారాం ఏచూరి జయంతిని బుధవారం బొమ్మలరామారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, భిక్షపతి, సత్యనారాయణ, బాలరాజు, రాధమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

ఆలేరును అగ్రస్థానంలో నిలుపుతా

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్టలో ఇందిరమ్మ నమూనా గృహాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెడతానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఇందిరమ్మ నమూనా గృహాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గానికి 3,700 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు, ఇప్పటికే పలు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేశారన్నారు. ప్రతి ఆది, సోమవారం మార్నింగ్ వాకింగ్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని, కుటుంబ సభ్యులు పిల్లలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, తహసీల్దార్ గణేష్, ఎంపీడీఓ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, భిక్షపతి, మంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశ ఐక్యతను అస్థిరపరిచే కుట్రలు తిప్పికొడదాం



భువనగిరిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : భారతదేశ ఐక్యతను అస్థిరపరిచే కుట్రలను తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హైదరాబద్–విజయవాడ జాతీయ రహదారిపై హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మండల, మున్సిపల్ కమిటీ అధ్యక్షులు కైరంకొండ అశోక్, కడారి కల్పన, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్, మండల అధ్యక్షుడు పబ్బు వంశీ, ట్రినిటీ స్కూల్ చైర్మన్ కెవీబీ.కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, నాయకులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ : తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

భువనగిరి: భువనగిరిలో బుధవారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ బండిరాజుల రామకృష్ణ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్, తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ సుర్వి శ్రీనివాస్‌గౌడ్, కో కన్వీనర్ కుమార స్వామి, పట్టణ కన్వీనర్ రమేష్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పోతంశెట్టి రవీందర్, దాసరి మల్లేశం, పడమటి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వలిగొండ మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర, జాతీయ జెండా వితరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సీఎస్ రెడ్డి, ఏలే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి కొప్పుల యాది రెడ్డి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మందుల లక్ష్మి, మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కందుల తానేష, బొడిగే ఆనంద్, బచ్చు శ్రీనివాస్, బంధారపు రాములు, మందుల నాగరాజు, లోడే లింగస్వామి గౌడ్, అమర్, అంజమ్మ పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

వలిగొండ : ప్రజా నాట్యమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 20, 21న రామన్నపేటలో నిర్వహించనున్న ప్రజా నాట్యమండలి జిల్లా మహాసభ, జానపద వీధి నాటకోత్సవాలను జయప్రదం చేయాలని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం వలిగొండ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈర్లపెల్లి ముత్యాలు, దేశపాక రవి, రుద్రపెల్లి రామలింగం, రాదారపు మల్లేశం, స్వామి, రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

రాజాపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సస్పెన్షన్

రాజాపేట : రాజాపేట బాలుర ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు సట్టు జయంత సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈమె గతేడాది ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సమయంలో పీఎంశ్రీ కింద పాఠశాలకు వచ్చిన నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ చేసిన అనంతరం జిల్లా విద్యాధికారి సత్యనారాయణ జయంతను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



రామన్నపేట: జనంపల్లి గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



రాజాపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ

రాజాపేట : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జెడ్పీసీఈఓ శోభారాణి అన్నారు. బుధవారం రాజాపేట మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి భారీ వర్షాల కారణంగా తీసుకునే జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డీపీఓ సునంద, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఆవుల కిషన్, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఎస్‌ఐ యాదయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలేరు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆలేరు ఆబ్కారీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దీపిక అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్(ఎన్ఎంబీఏ) కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాలపై బుధవారం ఆలేరు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారామ్, ఆబ్కారీ ఎస్‌ఐ నిరోషా, యాంటీ డ్రగ్స్ కమిటీ కన్వీనర్ వెంకటేష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చౌటుప్పల్ : మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి అన్నారు. నిషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం చౌటుప్పల్ మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ అంజయ్య, ఆర్‌వో శ్రీధర్‌రెడ్డి, ఉద్యోగులు వరలక్ష్మి, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

వలిగొండ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ జలందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం వలిగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ కేదారీశ్వర్ పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

మోత్కూరు : యువత మత్తుకు బానిస కావొద్దని మోత్కూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డి అన్నారు. మత్తు పదార్థాల నిరోధంపై బుధవారం చేపట్టిన సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.పరశురాములు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ క్రాంతికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కడారు నర్సింహారెడ్డి, యాంటి డ్రగ్స్ స్టూడెంట్ కౌన్సిలర్ సి.హెచ్.లింగస్వామి, కన్వీనర్ సి.హెచ్.అంజయ్య పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మాదక ద్రవ్యాలు నివారించేందుకు సహకరించాలని ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ కోరారు. బుధవారం బొమ్మలరామారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని భూదాన్‌పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు తులసి, రాజేశ్వరమ్మ, శివశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ సాయివర్దన్, వెంకటరెడి పాల్గొన్నారు.

గుండాల : మాదక ద్రవ్యాలను నిషేధించాలని కోరుతూ బుధవారం గుండాల మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రావు, ఎంపీఓ సలీమ్, సూపరింటెండెంట్ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్ పాల్గొన్నారు.

ఆలేరు: డ్రగ్స్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని ఆలేరు తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. బుధవారం ఆలేరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఆలేరు మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ జగన్‌మోహన్, వార్డు అధికారులు, ఇతర సిబ్బందితో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు.

రామన్నపేట: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కోరారు. బుధవారం రామన్నపేట మండలంలోని జనంపల్లి బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవూఫ్‌అలీ ఉన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలోని అడ్డగూడూరు పోలీస్ శాఖ ఆధ్వరంలో మాదకద్రవ్యాల పై బుధవారం మండల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్‌ఐ ఈశ్వర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కార్పొరేట్ సంస్థల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

భువనగిరిటౌన్ : కార్పొరేట్ సంస్థల నుంచి దేశాన్ని కాపాడుకుందామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ, సీఐటీయూ కార్యదర్శి కల్లూరు మల్లేశం, తెలంగాణ రైస్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాయ కృష్ణ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వనం రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్, ఐద్వా భువనగిరి మండల కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక

వలిగొండ : కుమ్మరి సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని ఆ సంఘం నూతన మండల అధ్యక్షుడు బొడ్డుపెల్లి వెంకటేష్ అన్నారు. బుధవారం వలిగొండ మండల కేంద్రంలో మండల కమిటీ అధ్యక్షుడిగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దరిపెల్లి ప్రవీణ్ కుమార్, ఓరుగంటి గోపాల్, పాలేర్ల మహేష్, బేతాళ మల్లేష్, ఓరుగంటి సాయికిరణ్, గంగదారి నరసింహ, పరశురాములు, దానయ్య , గంగదారి విక్రమ్, నానచర్ల ఆంజనేయులు, రాజ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

రమణేశ్వరంలో శతరుద్ర శివలింగ ప్రతిష్ఠ



పంచగవ్యప్రాశన నిర్వహిస్తున్న సిద్ధగురు రమణానంద మహర్షి

భువనగిరి: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో గల రమణేశ్వరంలోని శివశక్తి షిర్డీ సాయి అనుగ్రహ పీఠంలో బుధవారం శత రుద్ర శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సిద్దగురు రమణానంద మహర్షి ప్రారంభించారు. 20వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా తొలి రోజు సిద్ధగురు ధ్యానం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం నిర్వహించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ కోరారు. ఆర్థిక సేవల శాఖ (డీఎఫ్ఎస్) మార్గదర్శకాల మేరకు బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో జిల్లా లీడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో జనన సురక్ష బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జనధన్ యోజన ఖాతాలు తెరవాలని, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన నమోదు ప్రక్రియపై మరింత దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు హన్మకొండ రీజినల్ మేనేజర్ శాంతికుమార్, ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మి, శ్రావ్య, లీడ్ జిల్లా మేనేజర్ శివరామ కృష్ణ, ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర డైరెక్టర్ అశోక్, ఏపీఎం నీరజ, పోచంపల్లి, జిబ్లక్‌పల్లి బ్రాంచ మేనేజర్లు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలో బుధవారం హమాలీ సంఘం ఆధ్వర్యంలో క్యూబా దేశానికి సహాయనిధి కోసం విరాళాల సేకరణ చేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి మాట్లాడుతూ.. అమెరికా తదితర దేశాలు క్యూబా దేశంపై అనేక ఆర్థిక ఆంక్షలతో ఆటంకాలు సృష్టిస్తున్నాయన్నారు. సోషలిస్ట్ నేత క్యాస్ట్రో జయంతి సందర్భంగా క్యూబా దేశానికి ప్రతిఒక్కరూ సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు తంగెళ్ల సత్తయ్య, సైదుగాని లచ్చయ్య, గంటీల బాలయ్య, లక్ష్మయ్య, రాంచంద్రం, పాండు, రాము పాల్గొన్నారు.